సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 5 | జూన్ | 2023

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40^0/28^0

ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా.. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి ఉక్కపోత ఉంటుంది.



చదువుతోపాటు సంస్కారం..

చదువుతోపాటు సంస్కారం ముఖ్యమని ఏకల్ విద్యాలయ అభియాన్ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ రాఘవేందర్ అన్నారు. - 8లో▸

న్యూస్‌రీల్

నిట్‌లో ముగిసిన వర్క్‌షాపు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. భూ సర్వేలో అడ్వాన్స్‌డ్ సర్వేయింగ్ అండ్ రిమోట్ సెన్సింగ్ రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఐఐటీ, నిట్, సెంట్రల్ యూనివర్సిటీ పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు వర్క్‌షాపులో శిక్షణ ఇచ్చినట్లు ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్ శ్యాంవీర్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు ఎం.శశి, అనురాగ్, రాజశేఖర్, మనాళిపాల్, రఘురామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీసీ కోర్సు పరీక్ష ఫీజు చెల్లించాలి

విద్యారణ్యపురి: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) కోర్సు–2023కు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లించాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 42 రోజులపాటు శిక్షణ పొందిన వారు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా రూ.150 ఈనెల 16 వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 24 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. గతంలో ఈ కోర్సు పూర్తిచేసి ఫెయిల్ అయిన వారు సైతం పరీక్ష ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాతపూర్వకంగా ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించాలని తెలిపారు.

నేటి వరంగల్ గ్రీవెన్స్ రద్దు

కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రజలు గమనించాలని కోరారు.

పోలీస్ గ్రీవెన్స్ కూడా..

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసినట్లు సీపీ ఏవీ.రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఫిర్యాదు దారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విద్యుత్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హన్మకొండ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించే విద్యుత్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి కోరారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గస్థాయిలో వేడుకలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రతి నెలా ఒకటిన వేతనాలు చెల్లించాలి

గీసుకొండ: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, రెండో పీఆర్సీ కమిటీ వేసి జూలై నుంచి ఫిట్‌మెంట్ ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర సెంట్రల్ కోర్ కమిటీ సభ్యులు బత్తిని సుదర్శన్‌గౌడ్ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆదివారం ఆయన సీఎంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. మెయిల్ ద్వారా విన్నవించారు. బకాయి డీఏలను చెల్లించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు ఉన్నట్టా..లేనట్టా..?

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ శాఖలో లాంగ్ స్టాండింగ్ సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు ఉన్నట్టా.. లేనట్టా అనే చర్చ జోరుగా కొనసాగుతోంది. ఉమ్మడి వరంగల్ పరిధిలో మూడేళ్ల కాలం దాటిన సబ్ రిజిస్ట్రార్లు గ్రేడ్–1, 2 ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈనెల 5వ తేదీలోపు బదిలీల జాబితా తయారు చేసి ఉత్తర్వులు జారీ చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో సోమవారం బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

చీకటి నుంచి వెలుగులోకి..

స్వరాష్ట్రంలో నిరంతర విద్యుత్

- టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.7,086 కోట్లతో పనులు
- వివిధ విభాగాల్లో సంస్థకు 40 అవార్డులు
- నేడు విద్యుత్ దినోత్సవం





టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం, అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ సరఫరాలో తిరుగులేని రాష్ట్రంగా తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. చీకట్లను తొలగించి వెలుగులు విరజిమ్ముతోంది. అందులోనూ ఎన్పీడీసీఎల్ పరిధిలో గణనీయమైన ప్రగతి సాధించింది. రూ.1,595 కోట్లతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటుతో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సోమవారం విద్యుత్ విజయోత్సవం సందర్భంగా ఎన్పీడీసీఎల్ సాధించిన ప్రగతిపై కథనం..

రాష్ట్ర ఆవిర్భావానికి ముందు టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,310 మెగావాట్లు కాగా ప్రస్తుతం 5,944 మెగావాట్లకు (159 శాతం) పెరిగింది. గతంలో గరిష్ట విద్యుత్ వినియోగం రోజుకు 43 మిలియన్ యూనిట్లు ఉంటే ప్రస్తుతం 111 మిలియన్ యూనిట్లు(156 శాతం) చేరింది. నాడు తలసరి విద్యుత్ వినియోగం 775 కిలోవాట్లు కాగా నేడు 1,473 కిలోవాట్లకు పెరిగింది. తలసరి విద్యుత్ వినియోగం 90 శాతం అధికమైంది. పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో రూ.149 కోట్లతో, పట్టణ ప్రగతి ద్వారా పట్టణాల్లో రూ.57 కోట్లతో విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. 575 గ్రామాలను అధికారులు దత్తత తీసుకుని సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు రూ.52 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నుంచి ఏ-ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందింది. విద్యుత్ సరఫరా నష్టాలు గతంలో 13.25 శాతం ఉంటే వాటిని ప్రస్తుతం 9.65 శాతానికి తగ్గించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) ఫెయిల్యూర్లను 14.41 శాతం నుంచి 10.76 శాతానికి తగ్గించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల(పీటీఆర్) ఫెయిల్యూర్లను 4.9 నుంచి 1.87 శాతానికి తగ్గించారు.

అభివృద్ధి పథమిలా..

- తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2018 నుంచి వ్యవసాయానికి నిరంతరంగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. రూ.1,961 కోట్లతో 3,37,500 నూతన సర్వీస్‌లు మంజూరు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.6,733 కోట్ల రాయితీ ఇస్తోంది. ప్రస్తుతం 12.87 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 7,868 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది.
- రాష్ట్ర ఆవిర్భావం నుంచి టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.7,086 కోట్లతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. సబ్ స్టేషన్లు, నూతన విద్యుత్ లైన్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేశారు. టీఎస్ ఐపాస్ కింద అత్యంత వేగవంతంగా 6,242 పరిశ్రమలకు సర్వీస్‌లు మంజూరు చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి నామమాత్ర చార్జీతో 1,62,435 సర్వీస్‌లు మంజూరు ఇచ్చారు.
- ఎన్పీడీసీఎల్ పరిధిలోని 66 ఎస్టీ ఆవాసాలకు రూ.143.02 కోట్ల వ్యయంతో 3 ఫేజ్ విద్యుదీకరణ పనులు చేపట్టారు. 46 గిరిజన ఆవాసాల్లో 3,485 గృహాలకు, 4,202 వ్యవసాయ పంపు సెట్లకు సర్వీస్‌లు మంజూరు చేశారు. గిరి వికాసం కింద ఎస్టీ వినియోగదారులకు 1,466 వ్యవసాయ సర్వీస్‌లు మంజూరు చేశారు.
- సౌర విద్యుత్ ఉత్పత్తిలోను ఎన్పీడీసీఎల్ ప్రగతి సాధించింది. 18 మెగావాట్ల నుంచి 1,246 మెగావాట్లకు విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. రూఫ్‌టాప్ విద్యుత్ ఉత్పత్తి 29.49 మెగావాట్లకు పెరిగింది.



వ్యవస్థాపరంగా వృద్ధి..

పరిపాలనా సౌలభ్యం కోసం వ్యవస్థాపరంగా అభివృద్ధి చేశారు. జిల్లాల పునర్విభజన మేరకు నూతన సర్కిళ్లు ఏర్పాటు చేశారు. సర్కిల్‌ను 5 నుంచి 16కు, డివిజన్లు 14 నుంచి 40, సబ్ డివిజన్లు 41 నుంచి 124, ఆపరేషన్ సెక్షన్లు 296 నుంచి 454కు, ఈఆర్‌ఓలు 296 నుంచి 454కు పెరిగాయి. మొత్తం 3,705 ఉద్యోగాలు భర్తీ చేశారు. ఇందులో ఏఈలు 306, సబ్ ఇంజినీర్లు 503, జేఏఓలు 107, జేపీఓలు 25, జేఎల్ఎంలు 2357, జూనియర్ అసిస్టెంట్లు 175, ఇతర ఉద్యోగాలు 232 భర్తీ చేశారు. 3,535 ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆర్టిజన్లుగా, సంస్థ ఉద్యోగులుగా గుర్తించారు.

40 అవార్డులు

విద్యుత్ రంగంలో వివిధ విభాగాల్లో సాధించిన ప్రగతికి టీఎస్ ఎన్పీడీసీఎల్ 40 అవార్డులు అందుకుంది. 17 ఇప్పాయి, 12 స్కోచ్, 3 గవర్నెన్స్ నవ్ పీఎస్‌యూ, 2 ఐసీసీ ఇండియన్ ఎనర్జీ సమ్మిట్, ఈక్యూ తెలంగాణ స్టేట్ సోలార్ అవార్డు, ఇండియన్ ఫెడరేషన్ ఫర్ గ్రీన్ ఎనర్జీ అవార్డులు సొంతం చేసుకుంది.

వివిధ వర్గాలకు రాయితీలు

గతంలో ఎస్సీ, ఎస్టీల ఆవాసాలకు 50 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తే ప్రస్తుతం 101 యూనిట్ల వరకు ఇస్తున్నారు. ఎస్సీ వినియోగదారులు 2,93,292 మందికి రూ.245 కోట్లు, 1,88,654 ఎస్టీ వినియోగదారులకు రూ.158 కోట్లు రాయితీ కింద వెచ్చిస్తున్నారు. అలాగే సెలూన్లు, లాండ్రీ, దోభీఘాట్లకు 250 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. 13,164 సెలూన్లకు రూ.9.71 కోట్లు, 25,315 లాండ్రీ, దోభీఘాట్లకు రూ.25 కోట్ల రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. పౌల్ట్రీ, స్పిన్నింగ్ మిల్లులకు రాయితీ ఇస్తోంది. అలాగే డిమాండ్ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు 3,259 మెగావాట్ల నాణ్యమైన విద్యుత్ ఎన్పీడీసీఎల్ సరఫరా చేస్తోంది. మిషన్ భగీరథకు 101 మెగావాట్ల విద్యుత్ అందిస్తోంది.




టీఎస్ ఎన్పీడీసీఎల్ అందుకున్న అవార్డులు

వెలుగుల తెలంగాణగా అభివృద్ధి



కారు చీకట్ల నుంచి వెలుగుల తెలంగాణగా విద్యుత్ రంగంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, విద్యుత్ ఉద్యోగులు, అధికారుల సమన్వయంతో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో ఎంతో ప్రగతి సాధించాం. నాణ్యమైన, మెరుగైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు శ్రమిస్తున్నారు. వారి కృషితో నేడు నిరంతరాయంగా అన్ని వర్గాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– అన్నమనేని గోపాల్‌రావు, సీఎండీ, టీఎస్ ఎన్పీడీసీఎల్



వాహనాల ర్యాలీ (డ్రోన్ ఫొటో)

'సురక్షా దివస్' ర్యాలీ

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోకార్స్, బ్లూకోల్ట్స్, అగ్నిమాపక, షీటీం, భరోసా, ఏహెచ్‌టీయూ, ట్రాఫిక్ విభాగాలకు సంబంధించిన వాహనాలతో భారీ ర్యాలీ చేపట్టారు. కమిషనరేట్ కార్యాలయం నుంచి వరంగల్, ధర్మారం, ఓసిటీ, మామునూరు, హంటర్‌రోడ్డు, కాజీపేట ప్రాంతాల మీదుగా కొనసాగిన ఈ ర్యాలీలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎమ్మెల్యే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

– వరంగల్ క్రైం

- వివరాలు 8లో▸

ప్రతి పాలసీలో ఇండియా ఫస్ట్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న బీఎల్.వర్మ, పక్కన రావు పద్మ, శ్రీధర్, ధర్మారావు, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

- కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతి పాలసీలోనూ 'ఇండియా ఫస్ట్' అనే కచ్చితమైన నిర్ణయంతో ముందుకు వెళ్తోందని కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బి.ఎల్.వర్మ అన్నారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో దేశంలోని ఏ మూల కూడా వెనుకబడి ఉండకూడదన్నదే ప్రభుత్వ అభిమతమని, ఆ మేరకు తొమ్మిదేళ్ల పాలనలో అందరినీ కలుపుకొని సర్వోతముఖాభివృద్ధి సాధించామని చెప్పారు. అంత్యోదయ లక్ష్యాన్ని సాకారం చేయడంతోపాటు సమాజంలో చివరి స్థానంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేరి ఫలాలు అందడానికి ప్రధాని దార్శనిక విధానాలే కారణమన్నారు. యువతకు కొత్త అవకాశాలు వచ్చాయని, రైతులు అభివృద్ధి చెందారని, పేదలు, మహిళలు బాగుపడ్డారని, కూలీలకు గౌరవం లభించిందని పేర్కొన్నారు. గ్రామాలు, జాతీయ రహదారుల అభివృద్ధి చేపట్టామని వివరించారు. ప్రభుత్వ విజన్, పాలసీ స్పష్టంగా ఉంటే దాని తేడా స్పష్టంగా కనిపిస్తుందని, పారదర్శకత లేకుంటే పై నుంచి రూ.100 పంపితే రూ.15 మాత్రమే ప్రజలకు చేరుతుందని ఒక మాజీ ప్రధాని చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ రూ.100 పేదలకు పంపితే రూ.100 నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి చేరుతున్నదని చెప్పారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయం చూసి కొందరు సహించలేకపోతున్నారని, విపక్షాల విమర్శలు, దాడుల మధ్య భారత్ తన లక్ష్యాల వైపు వేగంగా దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, నాయకులు డాక్టర్ జి.విజయరామారావు, మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి, కట్ట సుధాకర్, డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్



2కే రన్ నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి కాళోజీ విగ్రహం వరకు యూనియన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బ్రిజ్‌భూషణ్‌ను భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని, ఎఫ్ఐఆర్ ఆధారంగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, ఎం.సదాశివరెడ్డి, బద్దం వెంకటరెడ్డి, పెండెం రాజు, ఉపాధ్యక్షుడు రవీందర్‌రాజు, బాధ్యులు సృజన్, డి.కిరణ్‌కుమార్, చంద్రయ్య, రతన్‌సింగ్, నరేష్, స్టాలిన్, రవూఫ్, రమేష్, శ్రీనివాస్, కరుణాకర్, మహిళా కన్వీనర్ రేణుక పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపునకు కృషి

అభ్యసన అభివృద్ధికి 'లిప్' కార్యక్రమం

- 6 నుంచి 9 తరగతులకు అమలు
- 67 ప్రాథమిక, 125 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లబ్ధి



బుధరావుపేటలోని టీఎస్ మోడల్ స్కూల్

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అభ్యసన అభివృద్ధి కార్యక్రమం(లిప్)ను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. గతేడాది ఆగస్టు 15 నుంచి ప్రారంభమైన 'తొలిమెట్టు' (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో కనీస, విషయ సామర్థ్యాల సాధనకు తోడ్పడింది. తొలిమెట్టు 453 ప్రాథమిక, 67 ప్రాథమికోన్నత పాఠశాలల్లో విజయవంతంగా ఈఏడాది మార్చి 31 వరకు కొనసాగింది. రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్రటరీ వాకాటి కరుణ తొలిమెట్టునే కొనసాగింపుగా 6 నుంచి 9వ తరగతులకు 'లిప్' అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పేరుతో ఈవిద్యాసంవత్సరం (2023–2024) నుంచి కొనసాగించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలో 67 ప్రాథమికోన్నత పాఠశాలలు, 125 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేయనున్నారు. 4 వేల మంది ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులు, సుమారు 18,000 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఈకార్యక్రమం ద్వారా లబ్ధి పొందనున్నారు.

రాష్ట్రస్థాయి సదస్సు..

ఈకార్యక్రమంపై మే 2వ తేదీన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా, మండల విద్యాశాఖాధికారులు, మండల నోడల్ ఆఫీసర్లు, హెడ్‌మాస్టర్లు, ఓయూసీఐపీలు హాజరయ్యారు. ఆ సదస్సులో 'లిప్' విధి విధానాలు, పై తరగతులకు ఎలా విస్తృతపర్చాలి. సామర్థ్యాల సాధన, ప్రధానోపాధ్యాయుడి పాత్ర, తరగతి గది బోధన పరిశీలన, విద్యార్థులకు గుణాత్మక విద్యనందించే విషయం, ఆంగ్ల మాధ్యమం–సవాళ్లు, మౌలిక, భాష, గణిత సామర్థ్యాల–సాధన, సైన్స్, సోషల్, మ్యాథ్స్‌లో అభ్యసన సామర్థ్యాలను ఎలా రాబట్టాలి? తదితర విషయాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. అనంతరం ఒక ముసాయిదా సిద్ధం చేశారు. త్వరలో లిప్‌కి సంబంధించిన విధి విధానాలు సిద్ధం కాబోతున్నాయి. ఈ 'లిప్'పై అవసరమైన కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ రాష్ట్ర విద్యా–పరిశోధన, శిక్షణ మండలిని ఆదేశించారు.

సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు..



'లిప్' కార్యక్రమం 6 నుంచి 9వ తరగతులకు జిల్లా వ్యాప్తంగా అమలు చేయబోతున్నాం. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చే గొప్ప కార్యక్రమమిది.

– డి.వాసంతి, వరంగల్ విద్యాశాఖ అధికారి

'తొలిమెట్టు' తరహాలోనే 'లిప్'



తొలిమెట్టు తరహా లోనే 'లిప్' కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడుతుంది. మౌలి క, భాష, గణిత, సామాజిక అంశాల్లో సమర్థుల్ని చేస్తుంది. జిల్లాలో 67 ప్రాథమికోన్నత పాఠశాలలు, 125 ఉన్న త పాఠశాలల్లో ఈకార్యక్రమం అమలు చేయనున్నాం. వేలాది మంది విద్యార్థుల సామర్థ్యాలు మరింత పెరుగనున్నాయి.

– మాలోతు సారయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి

న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తి దంపతులను ఆశీర్వదిస్తున్న 'గంగు'

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయాన్ని ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణ పట్నాయక్ దంపతులు ఆదివారం సందర్శించారు. వారిని ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం వల్లభ గణపతి దర్శనం, రుద్రేశ్వరస్వామికి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. ఆలయ నాట్య మండపంలో వారికి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు.

ధర్మమే విజయం సాధిస్తుంది

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ధర్మమే విజయం సాధిస్తుందని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ఆడిటోరియం మైదానంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి వరంగల్ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లో ఉమ్మడి రిజర్వేషన్ విధానం కారణంగా ఒకే కులానికి లాభం జరుగుతుందని 1965లో జస్టిస్ లోకుర్ కమిషన్ స్పష్టం చేసిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ సామాజిక వర్గంలోని అన్ని కులాలు, ఉప కులాలకు రిజర్వేషన్లు అందించాలనే లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం చేపట్టిందన్నారు. జాతి ప్రయోజనాలే తమకు ముఖ్యమని, అంబేడ్కర్, జగ్జీవన్‌రాం, రాంవిలాస్ పాశ్వాన్, కాన్షీరాం తరహాలోనే లక్ష్యం వైపు ప్రయాణం చేద్దామని పిలుపునిచ్చారు. జూలైలో జరగబోయే మారో యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు సుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, అధికార ప్రతినిధి మంద కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌మాదిగ పాల్గొన్నారు.

గ్రూప్‌-1 హాల్‌ టికెట్‌కు నిప్పంటించి నిరసన


హాల్‌ టికెట్‌కు నిప్పంటిస్తున్న విష్ణువర్ధన్‌

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది.. తక్షణమే పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలంటూ మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రంకు చెందిన పానుగంటి విష్ణువర్ధన్‌ అనే విద్యార్థి తన గ్రూప్‌–1 హాల్‌ టికెట్‌కు నిప్పంటించి నిరసన తెలిపాడు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీకేజీ వ్యవహారంలో నామమాత్రపు అరెస్టులతో కాలంగడుపుతూ నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. సిట్‌ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండానే.. మళ్లీ పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో నిఘాయంత్రాంగం పూర్తిస్థాయిలో విఫలమైందని విమర్శించారు.

ప్రమాదవశాత్తు టెంట్లు దగ్ధం


దగ్ధమైన టెంట్లు

భూపాలపల్లి రూరల్‌ : ప్రమాదవశాత్తు టెంట్లు దగ్ధమైన సంఘటన భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు సదస్సు కోసం గ్రామానికి చెందిన రత్నం తిరుపతి అనే టెంట్‌ హౌస్‌ యజమానికి సంబంధించిన రెండు టెంట్లు వేశారన్నారు. సమావేశం అనంతరం రాత్రి ప్రమాదవశాత్తు టెంట్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.60వేల వరకు నష్టం వాటిల్లినట్లు తిరుపతి తెలిపారు.

కుక్కల దాడిలో ఏడు మేక పిల్లల మృతి

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొన్నె గ్రామంలో ఆదివారం ఊర కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల నర్సయ్య రోజూ మాదిరిగానే మేకలను మేతకు తీసుకెళ్లాడు. కుక్కల గుంపు వచ్చి ఒక్కసారిగా మేకల మందపై దాడి చేయడంలో ఏడు మేక పిల్లలు మృతి చెందగా పలు మేకలకు గాయాలయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కుక్కల బెడదను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పోలీసులపై నమ్మకం పెరిగింది

- పోలీస్‌ వ్యవస్థలో గుణాత్మక మార్పులు
- ప్రభుత్వ చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌
- సురక్షా దినోత్సవం సందర్భంగా పోలీస్‌ వాహనాలతో భారీ ర్యాలీ

వరంగల్‌ క్రైం: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగిందని ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ వాహన ర్యాలీని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌, హనుమకొండ జిల్లా కలెక్టర్‌తో కలిసి చీఫ్‌విప్‌ ప్రారంభించారు. పెట్రోకార్స్‌, బ్లూకోల్ట్స్‌, అగ్నిమాపక్‌ వాహనాలు, షీటీం, భరోసా, ఏహెచ్‌టీయూ, ట్రాఫిక్‌ విభాగాలకు సంబంధించిన వాహనాల ర్యాలీ కమిషనరేట్‌ కార్యాలయం నుంచి వరంగల్‌, ధర్మారం, ఓసిటీ, మామునూర్‌, హంటర్‌ రోడ్డు, కాజీపేట ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా చీఫ్‌ విఫ్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, అందులో భాగంగా పోలీస్‌ శాఖలో తీసుకువచ్చిన మార్పులు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. సీపీ రంగనాథ్‌ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల కాలంలో పోలీస్‌ సాధించిన అభివృద్ధిని నివేదించడానికి ఈ కార్యక్రమం ఒక వేదికైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ రిజ్వాన్‌బాషా, డీసీపీలు మురళీధర్‌, కరుణాకర్‌, అబ్దుల్‌బారీ, ట్రెయినీ ఐపీఎస్‌ అంకిత్‌, ట్రెయినీ ఐఏఎస్‌ శ్రద్ధా శుక్లా, రీజినల్‌ ఫైర్‌ అధికారి పాపయ్య, హనుమకొండ ఫైర్‌ అధికారి భగవాన్‌ రెడ్డి, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండలో ర్యాలీని ప్రారంభిస్తున్న చీఫ్‌విప్‌, సీపీ, కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌


వరంగల్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీ, ఎమ్మెల్యే నరేందర్‌, కలెక్టర్‌ ప్రావీణ్య

సంస్కరణలను ప్రజలకు వివరించాలి

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కాజీపేట: రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ పోలీస్‌ వ్యవస్థలో తెచ్చిన సంస్కరణలను ప్రజలకు వివరించడానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి హనుమకొండ పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో జరిగిన సురక్షా దినోత్సవ ముగింపు సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సీపీ డాక్టర్‌ ఏవీ రంగనాథ్‌ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, అరూరి రమేష్‌, నన్నపనేని నరేందర్‌, మేయర్‌ గుండు సుధారాణి, 'కూడా' చైర్మన్‌ సుందర్‌రాజ్‌ యాదవ్‌, కలెక్టర్‌లు సిక్తా పట్నాయక్‌, ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో..

కరీమాబాద్‌: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్‌ ఐడీఓసీ గ్రౌండ్‌లో పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో 'సురక్షా' దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెట్రోకార్‌, బ్లూకోల్ట్స్‌ వాహనాల ప్రదర్శన, పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ ప్రావీణ్య, వరంగల్‌ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌, అడిషనల్‌ కలెక్టర్‌ అశ్వినితానాజీ వాకడే, డీసీపీలు బారి, కరుణాకర్‌, అడిషనల్‌ డీసీపీలు సురేశ్‌, సంజీవ్‌, ఏసీపీలు బోనాల కిషన్‌, కృపాకర్‌, ఆర్టీఓ మహేందర్‌జీ, సీఐలు ముష్కె శ్రీనివాస్‌, దగ్గు మల్లేశ్‌, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్‌ సీఐ బాబులాల్‌, ఏనుమాముల మార్కెట్‌ చైర్మన్‌ దిడ్డి భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్‌ రిజ్వానా షమీమ్‌ మసూద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లులోనే సుదర్శన్‌ విప్లవ పాఠాలు

- ఇక్కడి స్ఫూర్తితోనే ఆదిలాబాద్‌లో ఉద్యమాల విస్తరణ
- వరంగల్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీలో విద్యాభ్యాసం
- కేజీ సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్య సమకాలికుడు

కరీమాబాద్‌ : మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్‌ అలియాస్‌ ఆనంద్‌ వరంగల్‌ నుంచే విప్లవ పాఠాలు నేర్చుకున్నారు. విప్లవోద్యమానికి వరంగల్‌ ఒక ప్రయోగశాలగా ఆయన ప్రస్థానం కొనసాగింది. 1978లో వరంగల్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే కటకం సుదర్శన్‌ ఉద్యమాల వైపు ఆకర్షితుడయ్యారు. అప్పటి రీజినల్‌ ఇంజినీరింగ్‌ కళాశాల (ప్రస్తుత నిట్‌)లో పురుడుపోసుకున్న పీపుల్స్‌వార్‌ అనుబంధ రాడికల్‌ విద్యార్థి సంఘం (ఆర్‌ఎస్‌యూ) తర్వాత వరంగల్‌లోని కాకతీయ మెడికల్‌ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల, ఎల్‌బీ కళాశాల, సీకేఎం కళాశాల, సాయంత్రం కళాశాలలు విద్యార్థులను విశేషంగా ఆకర్షించాయి. కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమా స్కూల్‌లో పనిచేస్తూ విప్లవోద్యమానికి అంకురార్పణ చేసిన కేజీ సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్య, హనుమకొండలో బీఈడీ పూర్తి చేసిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్‌ గణపతి, ఆర్‌ఈసీలో చదివిన చిరుకూరి రాజ్‌కుమార్‌ అలియాస్‌ ఆజాద్‌, కేయూలో చదివిన పులి అంజయ్య అలియాస్‌ సాగర్‌ మలితరం విప్లవ యోధులుగా గుర్తింపు పొందారు. వీరి సమకాలికుడు సుదర్శన్‌ వరంగల్‌ పాలిటెక్నిక్‌ కళాశాల విద్యార్థి. ఇక్కడి స్ఫూర్తితోనే ఆదిలాబాద్‌ జిల్లా పారిశ్రామిక ప్రాంతం, గిరిజన గూడేలు, అడవుల్లోనూ ఆయన ఉద్యమాలను విస్తరించాడని ఉద్యమకారులు చెబుతారు. ఇదిలా ఉండగా గత నెల 31న కటకం సుదర్శన్‌ అలియాస్‌ ఆనంద్‌ మృతిచెందినట్లు మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో వరంగల్‌ పేరు మరోసారి తెరపైకి రావడం విశేషం.

ప్రమాదవశాత్తు వాగులోకి దూసుకెళ్లిన కారు

- కారు నడుపుతున్న వ్యక్తి మృతి


కారును బయటకు తీస్తున్న స్థానికులు


మృతుడు సందీప్‌

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని గౌరారంవాగుపై నూతనంగా నిర్మిస్తున్న మంగపేట–బోరునర్సాపురం బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు వాగులో బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరుర్సాపురం గ్రామానికి చెందిన మెకానిక్‌ నారా సందీప్‌ మంగపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గౌరారం వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డుపై పోసిన కంకర్రపై కారు అదుపుతప్పి రేయిలింగ్‌ను ఢీకొట్టి వాగులోపడింది. దీంతో కారులోని సందీప్‌ మృతిచెందాడు. గమనించిన స్థానికులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి, కారును నీటిలోంచి బయటకు తీశారు. అయితే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నప్పటికి ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురిఅవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు రోటోవేటర్‌లో పడిన డ్రైవర్‌

చెన్నారావుపేట: వరంగల్‌ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెం గ్రామ శివారు మాధవనగర్‌ కాలనీలో శనివారం రాత్రి ఓ ట్రాక్టర్‌ డ్రైవర్‌ దుక్కి దున్నె రోటోవేటర్‌లో పడి రెండు కాళ్లు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోజిపేట నారాయణతండాకు చెందిన బానోతు విష్ణు మాధవనగర్‌కు చెందిన రూపిక వెంకన్న వద్ద ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి రోటివేటర్‌తో భిక్షపతి చెలకలో దుక్కి దున్నుతున్నాడు. రోటివేటర్‌ను రిపేర్‌ చేస్తున్న సమయంలో డ్రైవర్‌ విష్ణు రోటోవేటర్‌లో పడిపోయాడు. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయలతో పాటు రెండు కాళ్లు విరిగిపోయాయి. చుట్టు ప్రక్కల రైతులు గమనించి హనుకొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విష్ణును ప్రభుత్వం ఆదుకోవాలని, దాతలు సాయం అందించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరారు.


ఆస్పత్రిలో విష్ణు

ఆస్పత్రిలో దొంగలు పడ్డారు

- సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో


డస్ట్‌బిన్‌, చీపుర్లను పట్టుకుని వస్తున్న పేషెంట్‌కేర్‌ సిబ్బంది


ద్విచక్రవాహనంపై తీసుకెళ్లేందుకు వచ్చిన సెక్యూరిటీగార్డ్‌

నెహ్రూసెంటర్‌: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు మెరుగైన వైద్యం, వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో సిబ్బంది చేతివాటంతో ఆస్పత్రికి చెడ్డపేరు వస్తుందని పలువురు అంటున్నారు. మహబూబాబాద్‌ ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో శానిటేషన్‌ వస్తువులైన డస్ట్‌బిన్‌, చీపుర్లు, ఇతర సామగ్రిని ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఎత్తుకెళ్లారు. ఆ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రభుత్వ ఆస్పత్రిలోని పేషెంట్‌కేర్‌ విభాగంలో పని చేసే ఓ మహిళ ఆస్పత్రి నుంచి డస్ట్‌బిన్‌ బకెట్‌, చీపుర్లను పట్టుకుని బయటకు రాగా అదే ఆస్పత్రిలో పని చేసే ఓ సెక్యూరిటీగార్డ్‌ తన ద్విచక్రవాహనంపై వచ్చి సదరు మహిళను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. ఇదంతా ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేయగా వైరల్‌గా మారింది. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఇదే ఘటనపై ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావును వివరణ కోరగా చోరీ జరిగిన విషయం ఆదివారం ఉదయం తన దృష్టికి వచ్చిందని, వెంటనే సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం అందించామని తెలిపారు. ఇదిలా ఉండగా వస్తువులను ఆస్పత్రి నుంచి తీసుకెళ్లిన విషయంలో పేషెంట్‌కేర్‌లో పని చేసే మహిళ, సెక్యూరిటీగార్డుపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

మానుకోట కృష్ణాకాలనీలో చోరీ


కృష్ణా కాలనీలో దొంగలు చెల్లాచెదురు చేసిన బ్యాగులు


ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మహబూబాబాద్‌ రూరల్‌ : ఓ ఇంట్లో దొంగలు ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వందలు చోరీ చేశారు. మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. కాలనీలోని గాధం శ్యామ్‌ ప్రసాద్‌ ఇంటికి.. ఇల్లందుకు చెందిన ఎర్రం.వెంకటేశ్వర్లు బుచ్చమ్మ దంపతులు శనివారం సాయంత్రం వచ్చారు. రాత్రివేళ ఉక్కపోత భరించలేక ఇంటి తలుపులు కొంత తెరిచి నిద్రించారు. రాత్రి ఒంటి గంట సమయంలో ఇంట్లో అలికిడి వినబడటంతో లేచి చూడగా బ్యాగు ఆరుబయట కనిపించింది. బ్యాగులో దాచిన ఐదున్నర తులాల బంగారు ఆభరణాలతోపాటు ప్యాంటులో ఉన్న రూ.1,500 దొంగలు అపహరించి పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా.. వేణుగోపాల స్వామి దేవాలయం పక్కన గల మల్లం బజారులో నివాసం ఉండే సునీత ఇంట్లో దొంగలు పడి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.90వేలు అపహరించినట్లు తెలిసింది. బాధితురాలు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు


పశువులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏటూరునాగారం: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌ పట్టణం వైపు ఏటూరునాగారం మీదుగా వెళ్తున్న పశువుల కంటైనర్‌ను స్థానిక ఎస్సై శ్రావణ్‌ కుమార్‌ ఆదివారం తెల్లవారు జామున ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం. పశువులు అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో హెడ్‌ కానిస్టేబుల్‌ రమేష్‌, కానిస్టేబుళ్లు సుధాకర్‌, ధృవ సిబ్బంది అటవీశాఖ చెక్‌ పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. రెండు వాహనాల్లో మొత్తం 38 పశువులను తరలిస్తున్నారు. గీసుకొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన బొలేరో వాహన డ్రైవర్‌ ధర్మసోత్‌ శ్రీను, పశువుల వ్యాపారి జాటోతు హీమ్లా, అశోక్‌ లీలాండ్‌ డ్రైవర్‌ సాయిరి క్రాంతి, భూక్య హీమ్లా, మరో కంటైనర్‌ డ్రైవర్‌ తమిళనాడుకు చెందిన సంతోష్‌కుమార్‌, సతీష్‌కుమార్‌లు 38 పశువులను చర్లచుట్టు పక్కల, ఛత్తీస్‌గఢ్‌ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు తీసుకొని వెళ్తున్నారు. వాటికి ఎలాంటి ఆహారం ఇవ్వకుండా ఒకదానిపై ఒకటి ఎక్కించి ఇబ్బందికి గురి చేస్తూ తరలించడంతో వాహనాలను నిలిపి పశువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ పశువులను భూపాలపల్లి మండలం రాంపూర్‌ గోశాలకు తరలించామన్నారు.

చదువుతో పాటు సంస్కారం ముఖ్యం


శిక్షణ పూర్తి చేసిన వారితో రాఘవేందర్‌

మహబూబాబాద్‌ రూరల్‌: చదువుతో పాటు సంస్కారం ముఖ్యమని ఏకల్‌ విద్యాలయ అభియాన్‌ ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జ్‌ కె.రాఘవేందర్‌ అన్నారు. ఏకల్‌ విద్యాలయ అభియాన్‌ పూర్తి సమయ కార్యకర్తల శిక్షణ శిబిరం మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో నిర్వహించారు. 3 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా రాఘవేందర్‌ మాట్లాడారు. 26 మంది పూర్తి సమయ కార్యకర్తలకు 3 రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారు 4 నుంచి 10 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు చదువు, సంస్కారం, విద్య, ఆరోగ్యంపై వివరిస్తారని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, ప్రభుత్వ పథకాలపై సత్సంగాలు, భజనలు, భక్తి పాటలతో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తారన్నారు. ఉపాధి అవకాశాల కోర్సుల ప్రాముఖ్యత, వ్యక్తిత్వ నైపుణ్య వికాసంపై యువతి, యువకులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏపీ, తెలంగాణ ట్రైనింగ్‌ ఇన్‌చార్జ్‌ కోటేశ్వర్‌రావు, ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జ్‌ వెంకన్న, శ్యాంసుందర్‌లోయ, పున్నంచంద్‌ మాల్పానీ, క్యాచ్‌వల్‌ శ్యాంసుందర్‌ శర్మ, శ్రీభక్తమార్కండేయ కవిత, ఏపీ ఇన్‌చార్జ్‌ ఆంజనేయ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

PLOT HOUSE FOR SALE

■ బొల్లికుంటలో కుడా లే–అవుట్‌ ప్లాట్లు Resale ఉన్నాయి. కేవలం 8500 మరియు మీకు తగిన బడ్జెట్‌లో ఇల్లు ఇప్పించబడును. మరియు ప్లాట్లు కూడా. సంప్ర॥ 9848022236. [W-785588]

FLATS FOR SALE

■ 2 BHK Flats for Sale. Ready to Occupy. TNGO's Colony Phase-2, Near: 100Ft Road, Sree Nivasam Apartment, HNK. Loan Available. Ph: 9440232703. [W-785583]

SERVICES

LOANS

■ సిరి అసోసియేట్స్‌: హౌజ్‌, ఫ్లాట్‌, ఓపెన్‌ ప్లాట్‌, ల్యాండ్‌, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. సెల్‌: 9666142226. [W-785581]

WANTED

■ కంప్యూటర్‌ పరిజ్ఞానం ఉన్న మహిళా రిసెప్షనిస్ట్‌, సెక్యూరిటీ, వాచ్‌మెన్‌ మరియు రూమ్‌ బాయ్స్‌ కావలెను. సంప్రదించండి. సెల్‌: 7799007778. [W-1110339]

■ సెక్యూరిటీ గార్డ్స్‌ కావలెను, హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌, సూపర్‌వైజర్స్‌ అర్జెంటుగా కావలెను. జీతం: 13000-16000. సంప్ర॥ 9703637320. [W-785587]

■ ప్రముఖ బుక్స్‌ పబ్లికేషన్‌లో పనిచేయుటకు లేడి స్కూల్‌ విజిటింగ్‌ రిసోర్స్‌ పర్సన్‌ కావలెను. WGL, HNK, KZP, Parakal. Female Degree with English / Willing to Travel. Cell: 9676591600. [W-785586]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌ టైమ్‌/ఫుల్‌టైమ్‌ పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 8341371684 [G-786393]

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. ఏజెంట్‌ కమీషన్‌ 6K. Ph: 9963114535, 7287061111 [H-793435]

■ హన్మకొండ – పరకాల స్కూల్‌ బస్సు నడుపుటకు డ్రైవర్స్‌ మరియు అటెండర్స్‌ కావలెను. సంప్రదించవలసిన సెల్‌ నెం. 8374896046. [K-1217051]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్‌ చూసి కొత్తరికార్డ్స్‌ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్‌ చేయండి. 8465843194 [G-600]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్‌ వాట్సాప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221311]

■ హన్మకొండ ప్రముఖ డయాగ్నస్టిక్‌ సెంటర్‌లో హౌస్‌ కీపింగ్‌ వర్క్‌ చేయుటకు బాయ్స్‌ & లేడీస్‌ అర్జెంట్‌గా కావలెను. 9గం. డ్యూటీ, 4 W/O +ESI+PF+ మంచి జీతం. హౌస్‌ కీపింగ్‌లో అనుభవం గల ఫీల్డ్‌ సూపర్‌వైజర్స్‌ కావలెను. సంప్ర: 9032153413. [H-797695]

WANTED TEACHERS

■ Wanted teachers, to teach preprimary, Primary (all subjects), High SCL (Hindi, Maths, Science). Whatsapp your resume to 9154665006, Masster High School. Fort Warangal. [W-785585]

తాజా వార్తల కోసం లాగాన్‌ అవ్వండి www.sakshi.com

■ Wanted Lady Teachers to teach all subjects up to 7th class & PET, Dance teacher. English Fluency must. Pavani School, Edga, Bokkalagadda, HNK. Cell: 9393350567. [WA-6979]

CHANGE OF NAME

■ I, PARISHABOYEENA SRIKANTH, S/o. PARISHABOYEENA SARANGAPANI, M/o PARISHABOYEENA KAMALA (Old Name), R/o H.No. 25-4-717, Vishnupuri, Kazipet, Hanumakonda District, T.S., have changed my name to PARSHABOINA SRIKANTH, S/o. PARSHABOINA SARANGAPANI, M/o. PARSHABOINA KAMALA (New Name), for all future purposes. [W-1110340]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్‌ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్‌ 9010144453
జయశంకర్‌ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నీటి బకెట్‌లో పడి బాలుడి మృతి


డానియల్‌ మృతదేహం

పాలకుర్తి టౌన్‌: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన చిన్నారి బాలుడు కడమంచి డానియల్‌(ఏడాదిన్నర) ప్రమాదవశాత్తు ఆదివారం సాయంత్రం నీటి బకెట్‌లో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఊర చెరువు బండలవద్ద బుడిగ జంగాలకు చెందిన కడమంచి మల్లేష్‌, రాములమ్మ చిన్నకుమారుడు డానియల్‌ ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి నీటిబకెట్‌లో పడి మృతి చెందాడు. స్థానిక సర్పంచ్‌ వీరమనేని యాకంతరావు సంఘటన స్థలాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్‌ కింద పడి బాలుడు..


నితిక్‌ మృతదేహం

భూపాలపల్లి రూరల్‌: భూపాలపల్లి మండలంలోని పంబాపూర్‌ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఓ బాలుడు ట్రాక్టర్‌ కిందపడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఎరుకల సంతోష్‌ కుమారుడు నితిక్‌ (7) ఇంటి వెనకాల ఆట ఆడుకుంటుండగా ఎర్ర రా జయ్యకు చెందిన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ గేర్‌ఫెయిల్‌ అయి బాలుడి పైనుంచి ట్రాక్టర్‌ వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో బాలున్ని చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యతో కలకలం

అర్ధరాత్రి చేరుకున్న బంధువులు


మానస ఆత్మహత్య చేసుకున్న గది బయట మరకలు

ఖమ్మం అర్బన్‌: జిల్లా కేంద్రంలోని మమత మెడికల్‌ కళాశాలలో బీడీఎస్‌ నాలుగో సంవత్సరం చదు వుతున్న సముద్రాల మానస(22) ఆత్మహత్య జిల్లాలో కలకలం సృష్టించింది. ప్రైవేట్‌ హాస్టల్‌లో ఉంటున్న ఆమె ఆదివారం సాయంత్రం సమీప బంక్‌లో పెట్రోల్‌ కొనుగోలు చేసుకుని గదికి వచ్చి శరీరంపై పోసుకుని నిప్పంటించుకుంది. కాగా, మానసకు బ్యాక్‌ ల్యాగ్‌ సబెక్టు ఉన్నట్లు తెలిసింది. అయితే, ఆమె ఆత్మహత్యకు ఇదే కారణమా, కాదా అన్నది తెలియరాలేదు. మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం ఆమె స్వస్థలమని తెలుస్తుండగా కొన్నాళ్ల క్రితం వరకు వరంగల్‌ ఎల్లంబజార్‌లో నివాసమున్న మానస కుటుంబం ఇటీవల హన్మకొండకు మారింది. అయితే, ఆమె తల్లి కొన్నేళ్ల క్రితం చనిపోగా తండ్రి మరో వివాహం చేసుకున్నాడని సమాచారం. అయితే, తండ్రి కూడా ఇటీవల చనిపోవడంతో మానస మాన సికంగా ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. కాగా, ఆమె ఒక్కరే బ్యాగ్‌లో బాటిల్‌తో బంక్‌కు వెళ్లి పెట్రోల్‌ కొనుగోలు చేసి వచ్చిన సీసీ పుటేజీ వీడియో బయటకు వచ్చింది. హాస్టల్‌ నిర్వాహకులు ఇచ్చిన సమా చారంతో మానస బంధువులు ఆదివారం అర్ధరాత్రి 12గంటలకు ఖమ్మం చేరుకుని ఖమ్మం అర్బన్‌ స్టేషన్‌లో పిటీషన్‌ ఇచ్చారు. ఇందులోనూ ఆమె ఆత్మ హత్యకు కారణాలేమీ పేర్కొనలేదని తెలిసింది. కాగా, ఆస్పత్రి మార్చురీ వద్దకు నలుగురైదుగురు స్నేహితులు చేరుకోగా ఓ విద్యార్థి రోదిస్తుండగా మిగతా వారు ఓదార్చినట్లు సమాచారం.

శుభకార్యానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రామారావు మృతదేహం

కురవి: బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రావిచెట్టు తండాకు చెందిన తేజావత్‌ రామారావు(40) ఖమ్మం జిల్లా కేంద్రంలోని పెద్దతండాలో నివాసం ఉంటూ.. ఖమ్మం డీఆర్‌డీఓ సీసీగా విధులు నిర్వహిస్తున్నాడు. రామారావు మరిపెడ నుంచి మహబూబాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో మన్నెగూడెం నుంచి వడ్ల బస్తాల లోడుతో మాధవపురకానికి వస్తున్న బజాజ్‌ ఆటో పెట్రోల్‌ బంక్‌లోకి వెళ్లి బయటకు వచ్చింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న రామారావు ఆటోలోని వడ్ల బస్తాకు ఢీకొట్టాడు. దీంతో రామారావు రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఖమ్మం జిల్లా ఏన్కూర్‌ మండలంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్నట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్‌లోని జనరల్‌ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కొత్తగూడ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఒకరు మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా కొత్తగూడ మండలకేంద్రం సమీపంలో ఆదివారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలం దుర్గారం గ్రామానికి చెందిన సిద్దబోయిన వీరస్వామి(40) మండల కేంద్రం నుంచి పోలారం వైపునకు, గంగారం మండలం తిరుమళగండి గ్రామానికి చెందిన తోలెం రమేష్‌ కొత్తగూడ వైపునకు వస్తున్నారు. ఈక్రమంలో కిష్టాపురం క్రాస్‌ రోడ్డు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో వీరస్వామి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై నగేష్‌ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. వీరస్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.